## క్లుప్తంగా

### రైతులు అప్రమత్తంగా ఉండాలి

కృష్ణగిరి: పత్తి పంటను ఆశించే గులాబీ రంగు పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం మండల కేంద్రంతో పాటు, వివిధ గ్రామాల్లో పంట నమోదు ప్రక్రియను పరిశీలించి రైతులకు గులాబీ రంగు పురుగు నివారణ చర్యలను వివరించారు. అలాగే పలుచోట్ల వేరుశనగకు ఆశించిన లద్దెపురుగు నివారణకు ఫ్లూబెండమైడ్ పురుగు మందును వేపనూనెతో కలిపి సాయంత్రం సమయంలో పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. పత్తి పంటలో ఆశించిన పచ్చదోమ నివారణకు ఆసిటామిప్రిడ్ లేదా ఫ్లోనికామిడ్ లేదా అసిఫేట్ పురుగు మందును వేపనూనెతో కలిపి పిచికారీ చేయాలన్నారు. గడ్డి పూలను గుర్తించినట్లయితే గులాబీ రంగు పురుగు ఉధృతి తెలుసుకుని మొదటి దశ నివారణకు ప్రొఫెనోఫాస్ మందును వేపనూనెతో కలిపి పిచికారీ చేయాలని చెప్పారు.

### హొళగుందలో పారిశుద్ధ్య పనులు

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదుల వెనుకనున్న డ్రైనేజీలో సర్పంచ్ చలవాది రంగమ్మ, పంచాయతీ ఈఓ రాజశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం పూడికతీత పనులు చేపట్టారు.కొన్నేళ్లుగా పూడిక తీయకపోవడంతో కాలువ పూడిపోయింది. ఈ కారణంగా విద్యార్థులు, పరిసర కాలనీల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యే వారు. వర్షా కాలంలో సమస్య అధికమవడంతో విషయాన్ని పీఎంసీ చైర్మన్ ద్వారకనాథ్, హెచ్ఎం నజీర్ అహమ్మద్ సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించి పంచాయతీ నిధులతో పూడిక తొలగింపు పనులను చేపట్టారు. అలాగే ఇతర కాలనీల్లో కూడా పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

### వెండి విరాళం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయానికి హైదరాబాద్ వాస్తవ్యులు గుండప్ప వారి కుటుంబ సభ్యులు కిలో వెండి, అష్టలక్ష్మి బిందెను విరాళంగా దేవాలయ కార్యాలయంలో సోమవారం అందజేసినట్లు డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ తెలిపారు. అలాగే కర్నూలుకు చెందిన సురేష్ 205గ్రాముల వెండి చెంబును విరాళంగా అందజేశారని చెప్పారు.

### అభివృద్ధికి నోచుకోని పల్లెలు!



బేతపల్లి ఊరి మధ్యలో ప్రవహిస్తున్న మురుగునీరు

దేవనకొండ: తరాలు మారినా ఆ గ్రామాల రాతలు మారడం లేదు. దేవనకొండ మండలంలోని చిట్టచివరి గ్రామాలైన బేతపల్లి, బండపల్లి గ్రామాల్లో అభివృద్ధి అందని ద్రాక్షగా మారింది. ఈ గ్రామాల్లో కనీసం తాగునీరు, పారిశుద్ధ్యం లాంటి వసతులు కూడా లేవు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక రోడ్లపైనే మురుగునీరు పారుతోంది. బేతపల్లిలో దాదాపు 300 ఇళ్లు ఉన్నాయి. 1500కు పైగా జనాభా ఉంది. బండపల్లిలో దాదాపు 700 జనాభా ఉంది. తమ గ్రామాల్లో కనీస వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

**ఆ రోడ్డుపై ప్రయాణం.. నరకయాతన**



అధ్వానంగా మారిన పి.కోటకొండ-బండపల్లి రోడ్డు

మండలంలోని పి.కోటకొండ-బేతపల్లి-బండపల్లి వరకు దాదాపు 3 కి.మీ. రహదారి అధ్వానంగా మారింది. ఈ రహదారిలో ప్రయాణించాలంటే ప్రజలు జంకుతున్నారు. 30 సంవత్సరాల క్రితం వేసిన రోడ్లకు ఇప్పటి వరకు మరమ్మతులు కూడా చేపట్టలేదు. ఆర్ అండ్‌బీ అధికారులు పి.కోటకొండ వరకు రోడ్డు వేసి, అక్కడి నుంచి తమ పరిధిలోకి రాదని వదిలేశారని స్థానిక అధికారులు చెబుతున్నారు. పంచాయతీ వారి వద్ద నిధులు లేవని రోడ్డు వేయడంలేదు. 3 కి.మీ. రోడ్డును దాటి ఊరు చేరాలంటే నరకయాతనగా మారిందని ప్రజలు వాపోతున్నారు. దాదాపు ఈ మూడు కి.మీ. దాటడానికి 45 నిమిషాల సమయం పడుతుందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

### భక్తులతో పులకించిన ఉరుకుంద పుణ్యక్షేత్రం

కౌతాళం: శ్రావణమాసం నాల్గవ సోమవారం సందర్భంగా ఈరన్నస్వామి క్షేత్రం భక్తులతో పులకించింది. ఆలయ పరిసరాల్లో ఎటు చూసినా సుమారు కిలోమీటర్ దూరం వరకు భక్తజనంతో ఆలయ పరిసరాలు నిండిపోయాయి. దేవాలయానికి చేరుకునే దారులన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులు ముందుగా ఎల్ఎల్‌సీ కాలువలో పుణ్యస్నానాలు ఆచరించి దర్శనానికి క్యూలైన్లో నిల్చున్నారు. లక్షకు పైగా భక్తులు స్వామిని దర్శించుకుని ఉంటారని అంచనా. శ్రావణమాసంలో సోమ, గురువారాల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ప్రత్యేకంగా సోమవారల్లో భక్తులు అధికంగా తరలివస్తారు.

---

### వైద్యులకు రక్షణ కల్పించాలి



ఇటీవల వైద్యశాలకు వచ్చే రోగులకు ఏదైనా జరిగితే వెంటనే రోగుల బంధువులు విధుల్లో ఉన్న వైద్యులపై దాడులు చేయడం ఆందోళన కలిగిస్తోంది. డాక్టర్లు ప్రాణాలు కాపాడుతారే కానీ తీయరని వారికి కూడా తెలుసు. కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార సంఘటన కలిచివేసింది. ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన చట్టాలు చేయాలి. వైద్యుల విధులకు ఆటంకం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. – డాక్టర్ శ్రీలక్ష్మి, ప్రభుత్వ వైద్యురాలు, పీహెచ్‌సీ, మద్దికెర



### వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించాలి



కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన మృగాలను కఠినంగా శిక్షించాలి. ప్రాణాలను కాపాడే వైద్యుల సేవలు అమూల్యమైనవి. నిర్భయంగా ఉన్నప్పుడు బాధ్యతతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఆస్పత్రుల్లో మహిళా వైద్యులు, నర్సులు, సిబ్బందికి రక్షణ కల్పించాలి. అన్ని శాఖల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు రక్షణకు ప్రభుత్వాలు ప్రాధాన్యమివ్వాలి.
– డాక్టర్ కల్పన, సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్, పత్తికొండ

# ఆదుకోని హంద్రీ-నీవా

- పూడికతో నిండిన ప్రధాన కాల్వలు
- పంట కాలువల ఏర్పాటులో అధికారుల అలసత్వం
- దేవనకొండ మండలంలో 45,500, కృష్ణగిరి మండలంలో 7,500 ఎకరాల ఆయకట్టు
- నగం ఆయకట్టుకూ నీరందని పరిస్థితి
- ఖాళీగా చెరువులు

కరువు కాటకాలు.. ఫ్యాక్షన్‌కు నిలయమైన రాయలసీమను సస్యశ్యామలం చేయాలని వైఎస్ రాజశేఖర్ రెడ్డి హంద్రీ నీవా సుజల స్రవంతి పథకానికి పునాది వేశారు. శ్రీశైలం జలాశయం నుంచి నీటిని చిత్తూరు జిల్లా కుప్పం వరకు తరలించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రధాన కాలువలను తవ్వి నీటి తరలింపు ప్రారంభించారు. ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో దేవనకొండ, కృష్ణగిరి మండలాల్లో ప్రధాన కాల్వలు మినహా పంట కాలువలు తవ్వకపోవడంతో నగం ఆయకట్టుకు కూడా నీరందని పరిస్థితి.



నీరు లేక ఖాళీగా ఉన్న దేవనకొండ చెరువు

కృష్ణగిరి/దేవనకొండ: వైఎస్సార్ అధికారంలోకి రాగానే హంద్రీనీవా సుజల స్రవంతి పథకాన్ని దాదాపు రూ.6,850 కోట్లతో చేపట్టారు. మొత్తంగా 6.02 లక్షల ఎకరాలకు సాగునీరు, అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లోని 33 లక్షల మందికి తాగునీరు అందించేలా పథకాన్ని రూపొందించారు. దీనికి ఆయన హయాంలోనే రూ.4,054 కోట్లు ఖర్చు చేశారు. దీంతో 2012లోనే కృష్ణా జలాలు హంద్రీనీవా కాలువలో అనంతపురంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు చేరాయి.

**80వేల ఎకరాలకు నీరందించాలని..**

ఈ పథకం కింద కర్నూలు జిల్లాలో ఏడు ఎత్తిపోతల పథకాలు, రెండు రిజర్వాయర్‌లతోపాటు రెండు చానల్ కాలువల ద్వారా దాదాపు 80వేల ఎకరాలకు సాగునీరు అందేలా రూపకల్పన చేశారు. కానీ అది కాస్త మరో 20వేల ఎకరాలకు పెరిగింది. అయితే అప్పట్లో రూపకల్పన చేసిన కృష్ణగిరి, పందికోన రిజర్వాయర్‌ల ద్వారా మాత్రం పూర్తిస్థాయి ఆయకట్టుకు నేటికీ నీరు అందడం లేదు. ఈ పథకం కింద కృష్ణగిరి మండలంలో మూడు ఎత్తిపోతల పథకాలతోపాటు కృష్ణగిరి సమీపంలో 0.164 టీఎంసీలతో రిజర్వాయర్ ఏర్పాటు చేశారు. దీని కింద మండలంలోని ఆరు గ్రామాల పరిధిలోని 5,100 ఎకరాలకు సాగు నీరు అందించేలా రూపకల్పన చేశారు. అలాగే లక్కసాగరం గ్రామ సమీపంలో చానల్ కాలువ ఏర్పాటుతో మరో 2,400 ఎకరాలకు నీరు అందుతుంది. అయితే రిజర్వాయర్ కింద కాలువ డిజైన్ సక్రమంగా లేకపోవంతో ప్రతేడాది సగం ఆయకట్టుకు మాత్రమే నీరు అందుతుంది. అలాగే దేవనకొండ మండలంలో దాదాపు 45,451 ఎకరాల ఆయకట్టును నిర్దేశించారు. తువ్వదొడ్డి వద్ద చానల్ పరిధిలో 2,400 ఎకరాల ఆయకట్టు ఉంది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి మల్యాల పంపింగ్ హౌస్‌కు నీటిని పంపింగ్ చేసి అక్కడి నుంచి గుండ్లకొండ పంపింగ్ హౌస్‌కు, అక్కడి నుంచి మోటార్ల ద్వారా పందికోన, కొత్తపల్లి రిజర్వాయర్లకు కృష్ణా నది నీరు చేరుకుంటుంది. పందికోన రిజర్వాయర్ నుంచి కుడి కాలువ ద్వారా దేవనకొండ మండలంలోకి నీరు ప్రవహిస్తుంది. అయితే ఇప్పటి వరకు 20 వేల ఎకరాలకు కూడా నీరందలేదు. పి.కోటకొండ, కొత్తపేట, పాలకుర్తి తదితర గ్రామాల్లో హంద్రీనీవా కాలువల నిర్మాణం కూడా చేపట్టలేదు. పంట కాలువలను తవ్వి, ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందిస్తే ఈ ప్రాంతం మరో కోనసీమగా మారనుంది.

**పూడికతో నిండిన ప్రధాన కాల్వలు..**

కృష్ణగిరి రిజర్వాయర్ కింద రెండు ప్రధాన కాల్వలు ఉన్నాయి. కుడి కాలువ 12.55 కి.మీ. మేర ఉంది. దీనికి కింద 3,500 ఎకరాల ఆయకట్టు ఉంది. కానీ ప్రధాన కాల్వ రిజర్వాయర్ సమీపం నుంచి ముళ్ల కంపలు, జమ్ముతో నిండిపోవడంతో కేవలం ఆరు కిలోమీటర్లు కూడా నీరు వెళ్లడం లేదు. అలాగే ఎడమ కాలువ మూడు కిలోమీటర్ల మేర ఉండగా వీటి కింద 1,600 ఎకరాలు ఆయకట్టు ఉంది. ఈ కాలువ కూడా పూర్తిగా జమ్ము, ముళ్ల కంపలతో నిండిపోవడంతో నీరు ముందుకు పారడం లేదు.

**సొంత ఖర్చులతో పూడికతీత..**

కుడి కాల్వ కింద నీరు ముందుకు వెళ్లక పోవడంతో గుడెంపాడు, మాదాపురం, కర్లకుంట, అమకతాడు గ్రామాల రైతులు డబ్బులు పోగు చేసుకుని ప్రొక్లెయినర్‌తో కాలువలో పూడిక తొలగింపు పనులు చేపడుతున్నారు. ఇక దేవనకొండ మండల పరిధిలో హంద్రీనీవా కాలువకు మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల కాలువలో చెట్లు విపరీతంగా పెరిగి నీటి ప్రవాహానికి అడ్డంకులుగా మారుతున్నాయి. గత ఐదు సంవత్సరాల్లో ఏటా ఉపాధి హామీ పథకం కింద కాలువల్లోని చెట్లను, గడ్డిని తొలగించడం వల్ల నీటి ప్రవాహానికి అడ్డంకులుండేవి కాదు. ఈ వేసవిలో ఉపాధిహామీ కింద కాలువను శుభ్రపరచకపోవడంతో నీటి ప్రవాహం ముందుకు సాగగకు చెరువులను నీటితో నింపలేక పోతున్నారు. శ్రీశైలం జలాశయం నిండకుండలా ఉన్నా పందికోన రిజర్వాయర్‌లో అరకొరగా నీరుండటం పరిస్థితిని తెలియజేస్తుంది. పందికోన రిజర్వాయర్ నుంచి తూతూ మంత్రంగా ఒకరోజు మాత్రమే నీరు వదిలి వెంటనే నిలిపివేస్తున్నారు. దీంతో దేవనకొండ మండలంలోని చెరువులు ఖాళీగా ఉన్నాయి.



కృష్ణగిరి రిజర్వాయర్ కుడి కాలువ ఇలా..



కంపచెట్లతో నిండిన ఎడమ కాలువ



దేవనకొండ సమీపంలో ఆనవాళ్లు కోల్పోయిన హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ

**సొంతంగా పూడిక తొలగిస్తున్నాం**



రిజర్వాయర్ కింద ప్రధాన కాల్వలు పూడికతో నిండిపోతున్నాయి. దీంతో పొలాలకు నీరు సక్రమంగా రావడం లేదు. కాలువ వెంట ఉన్న రైతులందరు తలా కొంత డబ్బులు వేసుకుని జేసీబీలతో పూడిక తీయిస్తున్నాం. ఇలా ఏటా మేమే చేయించకుంటున్నాం.
–నాగరాజు, రైతు, పుట్లూరు

**కాలువకు లైనింగ్ వేయాలి**



రిజర్వాయర్ నుంచి అమకతాడు వరకు దాదాపుగా 12 కిలోమీటర్ల కుడి కాలువ ఉంది. మా గ్రామ సరిహద్దులోకి ఒక్కసారి కూడా నీరు రాలేదు. ప్రధాన కాలువ కంపచెట్లు, జమ్ముతో నిండిపోయింది. దీంతో ఐదారు కిలోమీటర్ల వరకు కూడా నీరు సక్రమంగా రావడం లేదు. ప్రధాన కాలువకు లైనింగ్ వేస్తే చివరి ఆయకట్టుకు నీరందుతుంది.
– హనుమంతురెడ్డి, రైతు, అమకతాడు

**ప్రతిపాదనలు పంపాం**

కృష్ణగిరి రిజర్వాయర్, కాలువల మరమ్మతుల కోసం ఇప్పటి వరకు నిధులు రాలేదు. కానీ ఇప్పుడు రిజర్వాయర్ కట్ట మరమ్మతులతో పాటు ప్రధాన కాల్వల్లో పూడికతీత కోసం రూ.19 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాం.
– చెన్నయ్య, హెచ్ఎన్ఎస్, డీఈ

---

### జయప్రదం చేయండి

దేవనకొండ: సెప్టెంబర్ 1, 2, 3వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగే జాతీయ సమితి సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. సోమవారం దేవనకొండ క్రాస్ రోడ్డు టర్నింగ్ వద్ద నున్న కార్యాలయంలో ఏఐటీయూసీ అనుబంధ ఆటో, హమాలీ సంఘాల జనరల్ బాడీ సమావేశాన్ని మండల గౌరవాధ్యక్షులు ఎం.నరసారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్.కృష్ణయ్య మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. 4 లేబర్ కోడ్‌లను వెంటనే వెనక్కి తీసుకోవాలని, ఆటో హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని కోరారు. హమాలీ యూనియన్ అధ్యక్షుడు గంగన్న, ఆటో, హమాలీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు రాజన్న, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

### రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుగ్గలి : గుత్తి–పగిడిరాయి రైల్వే స్టేషన్ మధ్యనున్న బ్రిడ్జి సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన వ్యక్తి మృతదేహం పడిఉన్నట్లు సోమవారం గుత్తి రైల్వే పోలీసులకు సమాచారం అందింది. జీఆర్‌పీ ఎస్ఐ నాగప్ప తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు జొన్నగిరికి చెందిన వారాధి పాపన్న (54)గా గుర్తించారు. ట్రాక్ దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో మృతి చెంది ఉండవచ్చని చెప్పారు. మృతుడికి భార్య వరాలమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి



సూర్యనారాయణ రెడ్డి (ఫైల్)

మద్దికెర : పెరవలి గ్రామానికి చెందిన సూర్యనారాయణ రెడ్డి (55) అనే ఉపాధ్యాయుడు సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం తన గ్రామమైన నన్నూరులో పెళ్లి వేడుకల్లో పాల్గొని రాత్రి పెరవలికి వచ్చారని అయితే గుండెల్లో నొప్పి ఉందని మాత్రలు తీసుకోడానికి బయటికి వచ్చారని, తీవ్రం కావడంతో వైద్యపరీక్షల కోసం గుంతకల్లుకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు చేసి మృతి చెందాడని తెలిపారని కుటుంబసభ్యులు తెలిపారు. ఉపాధ్యాయుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రస్తుతం మద్దికెరలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ రంగస్వామి, హెచ్ఎంలు దేవేంద్రప్ప, శ్రీనివాసులు, ఆంజనేయులు, గౌస్ తదితరులు మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు.

### కోతి బసవన్న గుడిలో చోరీ

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎల్.బి. స్ట్రీట్‌లో వెలిసిన శ్రీ కోతి బసవేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఆలయంలో ఉన్న హుండీ పగలగొట్టి అందులో ఉన్న సుమారు రూ.15 వేలు దొంగలించబడ్డాయని ఆలయ క్యాషియర్ మోహన్ తెలిపారు. వెంటనే వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

---

# ముకుందా..మురారీ

- ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
- ఆకట్టుకున్న శ్రీకృష్ణ, గోపికల వేషధారణలు



పత్తికొండ ప్రతిభ స్కూల్‌లో రాధాకృష్ణ వేషధారణలో చిన్నారులు



తుగ్గలిలో కృష్ణుని ఇతివృత్తాన్ని వివరిస్తున్న భక్తురాలు



వెల్దుర్తిలోని సత్యసాయి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో నృత్యం చేస్తున్న చిన్నారులు

పత్తికొండ, తుగ్గలి : శ్రీ కృష్ణ జన్మాష్టమిని పత్తికొండ, తుగ్గలి మండలాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. కృష్ణమందిరాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో అలకంరించారు. ఉట్టి కొట్టడం, రాధాకృష్ణుడు, గోపికల ఇతివృత్తంతో ప్రదర్శనల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తుగ్గలి, రామలింగాయపల్లిలో త్రైతసిద్ధాంత సమితి ఆధ్వర్యంలో రాధాకృష్ణ విగ్రహాలు ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు జరిపించారు.

ఆలూరు: సమ్మోహన స్వరూపుడు శ్రీకృష్ణుడు. నల్లనయ్య జన్మాష్టమిని నియోజకవర్గంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఎల్లార్తి రోడ్డు సమీపంలో కొలువు దీరిన శ్రీ రాధా కృష్ణుల బ్రెయిలీ భగవద్గీత ఆలయంలో ఆలయం నిర్వహకులు బూర్ల లక్ష్మన్న ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి, వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ఆర్యవైశ్యులు విశేష పూజలు చేపట్టారు. చిన్నారులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో అలరించారు.

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, హలిగేర గ్రామాల్లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక భీమలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో గంగపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. భీమలింగేశ్వర ఆలయం వద్ద ఉట్లోత్సవం ఏర్పాటు చేశారు. యువకులు ఉట్టిని పగలగొట్టేందుకు చేసిన ప్రయత్నం ఆకట్టుకుంది. అనంతరం శ్రీకృష్ణుడి చిత్ర పటాన్ని ఊరేగించారు.

మద్దికెర : పెరవలి గ్రామంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకొని జమ్మానుకట్ట వద్ద స్వామివారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజలకు విచ్చేసిన భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈసందర్భంగా భగవద్గీతను చదివి వినిపించారు. అనంతరం స్వామి వారి చిత్ర పటాన్ని గ్రామంలో ఊరేగించారు.

హొళగుంద: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో కృష్ణాష్టమిని ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లల్లో కృష్ణుని విగ్రహాన్ని ఉంచి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఇళ్ల ముందు కృష్ణుని చిన్ని పాదాలు వేసి తమ పిల్లలను పాదాలలో నడిపించారు. కృష్ణ, రాధ, కామదేను, గోపి, గోపికల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.

హాలహర్వి: మండలంలోని హాలహర్వి, గూళ్యం, బిలేహాల్, నిట్రవట్టి తదితర గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే యాదవులు శ్రీకృష్ణుడి చిత్రపటాలకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆయా గ్రామాల్లో శ్రీకృష్ణుడి చిత్రపటాలను ఊరేగించారు.

దేవనకొండ: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీకృష్ణుడికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం దేవనకొండలో చిన్నారులు కోలాటమాడుతూ శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు.



కృష్ణుడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



శ్రీకృష్ణుడి చిత్రపటానికి పూజలు చేస్తున్న భక్తులు



దేవనకొండలో కోలాటమాడుతున్న చిన్నారులు

# రమణీయం.. సిద్ధేశ్వరుడి రథోత్సవం

ఆలూరు: శ్రావణమాసం నాలుగో సోమవారం సందర్భంగా స్థానిక కోట వీధిలో కొలువుదీరిన శ్రీ సిద్ధేశ్వరస్వామి వారి రథోత్సవం రమణీయంగా సాగింది. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, వీరశైవ లింగాయతులు, పీఠాధిపతులు హాజరవగా..రథాన్ని స్థానిక తేరు గడ్డ నుంచి కోటవీధిలోని భీమలింగేశ్వరస్వామి ఎదురు బసవన్న గుడి వద్దకు లాగి యథాస్థితికి చేర్చారు. అంతకుముందు సిద్ధేశ్వర ఆలయం నుంచి స్వామివారి ఉత్సవమూర్తిని అర్చకులు రేణుకారాధ్యాస్వామి, చంద్రశేఖరయ్య స్వామి ఆధ్వర్యంలో పల్లకీలో ఆశీనులు గావించి ఊరేగింపుగా రథం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ రథానికి, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టి, ఉత్సవ మూర్తిని రథంపై అధిష్టింపజేశారు. వేడుకను తిలకించేందుకు ఆదోని,ఎమ్మిగనూరు,పత్తికొండ, మంత్రాలయం నియోజకవర్గాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, రాయచూరు, శిరుగుప్ప,మోకా, సింధవాళం, బసరకోడు తదితర ప్రాంతాల నుంచి వీరశైవ లింగాయతీ కులస్తులు, మఠస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలూరు సీఐ కె. శ్రీనివాసనాయక్, సీవీ, నరసింహులు, హాలహర్వి, చిప్పగిరి, హొళగుంద మండలాల ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

---

# విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని వడ్డించండి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

ఆలూరు: గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలని ఎమ్మెల్యే బి.విరూపాక్షి హెచ్‌డబ్ల్యూఓలను ఆదేశించారు. సోమవారం స్థానిక హత్తిబెళగళ్ గ్రామ రోడ్డు సమీపంలోనున్న గిరిజన గురుకుల బాలుర, బాలికల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం నాణ్యత, పాఠ్యాపుస్తకాలు, నీటి సదుపాయం, మరుగుదొడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గిరిజన గురుకుల బాలికల పాఠశాలను ఇక్కడి నుంచి పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గలి మండల కేంద్రానికి తరలించాలని ఉన్నతాధికారుల ఉత్తర్వుల విషయంపై తాను ప్రత్యేకంగా చర్చించి నిలుపుదలకు కృషి చేస్తానని విద్యార్థులకు హామీఇచ్చారు. వైఎస్సార్ సీపీ మండల కో–ఆర్డినేటర్ అరికెర వీరేష్, ఎంపీటీసీ సభ్యుడు దేవరాజ్, మాజీ ఎంపీటీ సభ్యుడు నాగేంద్ర,వరుణ్, రాజ్ దేవ,పాన్‌వీరేష్ ఉన్నారు.

హొళగుంద: మండల కేంద్రానికి చెందిన రిటైర్డు హెచ్ఎం ఎర్రెప్ప భార్య ఈశ్వరమ్మ (61) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి సోమవారం మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు సోమిరెడ్డి, ఎస్కే గిరి, కాకి పక్కీరప్ప, వెంకటేష్ ఉన్నారు.

**పనులు నాణ్యతగా చేపట్టండి**

హొళగుంద: నాణ్యతలో రాజీ పడకుండా నాలుగు కాలాల పాటు మన్నేలా రోడ్డు పనులు చేపట్టాలని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి సూచించారు. కర్ణాటక సరిహద్దులో జరుగుతున్న హొళగుంద – మార్లమడికి 5.10 కి.మీ డబుల్ రోడ్డు పనులను సోమవారం పరిశీలించారు. ఎన్నికల ముందు సగం పనులు పూర్తి చేయగా.. మిగిలిన వాటిని ప్రస్తుతం చురుకుగా చేపడుతున్నారు. రూ.5.36 కోట్లతో జరుగుతున్న ఈ పనులు పూర్తయితే దశాబ్దాల కాలంగా రెండు రాష్ట్రాల మధ్య ప్రయాణ కష్టాలు తొలగనున్నాయి.



మార్లమడికి రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

**యువకుడి ఆత్మహత్య**

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణం కిలిచిన్ పేటకు చెందిన బి. చంద్ర కుమారుడు బి.వీరేష్(22) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఆదోని- ఇస్వీ అర్ఎస్‌ల కిలో మీటరు నంబర్ 496/8-10ల మధ్య డౌన్ లైన్ ట్రాక్ వద్ద గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు చెప్పారు.